# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శనివారం 20 జూన్ 2026






## తగ్గుముఖం పట్టిన టమోటా ధరలు

### ఆందోళనలో రైతులు

### నష్టాల బాటలో టమెటా రైతాంగం



మదనపల్లె, జూన్ 19 ప్రభాతవార్త : గత వారం రోజులుగా టమోటా ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లక్షలాది రుపాయలు పెట్టి సాగు చేసిన టమోటా రైతాంగం నష్టాల ఊబిలో ఉంటున్నారు. గిట్టుబాటుధర లేకపోవడంతో రైతులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. మార్కెట్‌కు టమో టాలు ఊహించని విధంగా వస్తుండడం, బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ లేకపోవడం వల్లే ధరలు తగ్గుముఖం పట్టాయంటూ వ్యాపారస్తులు చెబుతున్నారు. శుక్రవారం మార్కెట్‌యార్డులో పదికేజీల టమోటాబాక్స్ మొదటిరకం రూ.210నుంచి 220ల వరకు ధరలు పలికాయి. మిగతా 2వ పేజీలో

## ఏసిఏ సౌత్‌జోన్ అండర్ 16 బాలురు క్రికెట్ పోటీలు

వాల్మీకిపురం, జూన్ 19 ప్రభాతవార్త : పట్టణంలోని సీడీసీఏ జీవీఎస్సీఎస్ క్రీడామైదానంలో ఏసీఏ సౌత్ జోన్ అండర్16 బాలుర మల్టీడే క్రికెట్ అంతర్ జిల్లాల పోటీలు హోరాహోరిగా సాగాయి శుక్రవారం గ్రౌండ్1 క్రీడా మైదానంలో కడప, నెల్లూరు క్రికెట్ టీంలు తలపడ్డాయి క్రీడామైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప జట్టు 97 ఓవర్లలో 364 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది ఇందులో బ్యాట్స్మెన్ సాయిక్రిష్ణ చైతన్య 137 బంతుల్లో 102 పరుగులు చేసి అజేయ సెంచిరీ నమోదు చేశాడు. అలాగే లోకేష్ 107 బంతుల్లో 67 పరుగులు, శివచరణ్ 127 బంతుల్లో 68 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్కు దిగిన నెల్లూరు జట్టు 40.4 ఓవర్లలో 128 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. కడప లెఫ్ట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నర్ ముని జ్ఞానేశ్వర్ 13 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీయడంతో నెల్లూరు జట్టు పీకల్లోతు కష్టాల్లోకి వెళ్లిపోయి అపజయం పాలైంది. అలాగే గ్రౌండ్2లో గురువారం జరిగిన తొలి ఇన్నింగ్స్లో చిత్తూరు, కర్నూలు జిల్లా క్రికెట్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు క్రికెట్ జట్టు 82.1 ఓవర్లలో 342 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఇందులో రిత్విక్ 162 బంతుల్లో 159 పరుగులు చేసి సెంచరీ నమోదు చేశాడు. బ్యాట్స్మెన్ సాయి శ్రీవాస్తవ 92 బంతుల్లో 59 పరుగులు చేశాడు. చిత్తూరు క్రికెట్ జట్టుకు చెందిన బౌలర్లు బౌలర్ రక్షణసాయి 66 పరుగులు ఇచ్చి అరువికెట్లు తీశాడు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ క్రికెట్ విజయ్, సీడీసీఏ సెక్రటరీ సతీష్ యాదవ్,, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్ కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా చీఫ్ కోచ్ సునీల్ కుమార్, కర్నూలు, అనంతపురం జిల్లాల క్రికెట్ కోచ్లు ప్రసన్న కుమార్, షోయబ్లు, కడప కోచ్లు, సౌత్ జోన్ సెలెక్టర్లు జవహర్ బాషా, హరీష్, రెడ్డిగిరీష్లు, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఏపీఎల్‌లో భీమవరం

# బుల్స్ బుల్లెట్ విక్టరీ

### రేవంత్ రెడ్డి శతకంతో విజయవాడకు షాక్

### విజయవాడ సన్ షైనర్స్ భారీ స్కోరు వృధా

### 126 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా రేవంత్ రెడ్డి



సెంచరీ బాదిన రేవంత్ రెడ్డి

కడప, స్పోర్ట్స్,జూన్ 19, ప్రభాతవార్త : ఏపీఎల్-2026 సీజన్-5లో భాగంగా కడప వైఎస్సార్ రాజారెడ్డి స్టేడియం వేదికగా జరుగుతున్న టోర్నీలో మూడో రోజు తొలి మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. భీమవరం బుల్స్, విజయవాడ సన్‌షైనర్స్ జట్ల మధ్య జరిగిన పోరులో భీమవరం బుల్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భీమవరం బుల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన విజయవాడ సన్‌షైనర్స్ జట్టు ఓపెనర్లు శుభారంభం అందించారు. 10 ఓవర్లకు ఒక వికెట్ నష్టంతో 124 పరుగులు చేసిన విజయవాడ జట్టు భారీ స్కోరు దిశగా సాగింది. ఓపెనర్ అశ్విన్ హెబ్బార్ 29 బంతుల్లో 73 పరుగులతో (11 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జహీర్ అబ్బాస్ 25 బంతుల్లో 48 పరుగులు, హర్షవర్ధన్ 23 బంతుల్లో 33 పరుగులతో రాణించారు. దీంతో విజయవాడ సన్‌షైనర్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీ లక్ష్యాన్ని భీమవరం ముందు ఉంచింది. భీమవరం బౌలర్లలో పీవీఎస్ఎన్ రాజు 3 వికెట్లు పడగొట్టగా, సీహెచ్ రవితేజ, బి. యశ్వంత్ చెరో రెండు వికెట్లు సాధించారు. 212 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భీమవరం బుల్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ హేమంత్ రెడ్డి త్వరగా పెవిలియన్ చేరినా మరో ఓపెనర్ కే. రేవంత్ రెడ్డి బ్యాట్‌తో విధ్వంసం సృష్టిం చాడు. 61 బంతుల్లో 126 పరుగులతో అద్భుత శతకం నమోదు చేసి బౌండరీల వర్షం కురిపించాడు. మరోవైపు మిడిల్ ఆర్డర్ బ్యాటర్ రవికిరణ్ 24 బంతుల్లో 46 పరుగులు (3 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి జట్టుకు అండగా నిలిచాడు. వీరిద్దరి దూకుడుతో భీమవరం బుల్స్ 17.3 ఓవర్లలోనే 3 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. విజయవాడ సన్‌షైనర్స్ భారీ స్కోరు సాధించినప్పటికీ భీమవరం బ్యాటర్ల దూకుడుకు నిలువలేకపో యింది. అద్భుత శతకంతో జట్టును గెలిపించిన కే. రేవంత్ రెడ్డికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. మ్యాచ్ అమాంతం ప్రేక్షకులను శహరీ బ్యాండ్ అందరిని అలరించింది.






మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందుకుంటున్న సెంచరీ హీరో రేవంత్ రెడ్డి, దూకుడుగా ఆడిన రవికిరణ్

## ఎన్‌టిఆర్ సమాజానికి ఓ స్ఫూర్తి

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె, జూన్ 19, ప్రభాతవార్త : దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిరామారావు సమాజానికి ఓ స్ఫూర్తిలాంటి వారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్‌లో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుందుకు ఎన్‌టి.రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి అతి కొద్ది సమయంలోనే అధికారంలోకి వచ్చి పేద, బడుగు బలహీనవర్గాల వారికి ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన వారి స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఎన్‌టిఆర్ అడుగు జాడల్లోనే ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్, ఆర్‌జె.వెంకటేష్, లారీ సుధా, ఎస్‌ఎం.రఫి, సోమశేఖర్‌నాయుడు, తలారీ రాధ, పులి మహాలక్ష్మి, బాబునాయుడు, రాటకొండ మధుబాబు, విజయమ్మ, ఎరబల్లి వెంకటరమణారెడ్డి, డ్యాన్స్ రెడ్డప్ప, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో యూజీ2026

# అడ్మిషన్లు ప్రారంభం

### మొదటి రోజు 425 మంది విద్యార్థులకు సీట్లు

### డైరెక్టర్ విజయ్ ప్రకాష్



వేంపల్లె, జూన్ 19, ప్రభాతవార్త: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఆర్కే వ్యాలీ క్యాంపస్ లో యూజీ2026 అడ్మిషన్ల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. క్యాంపస్ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమాన్ని డైరెక్టర్ ప్రొఫెసర్ జి. విజయ్ ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, కష్టపడి చదివి భవిష్యత్తులో కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం క్యాంపస్‌లో సీట్లు పొందిన తొలి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు 500 మంది విద్యార్థులను పిలవగా 425 మంది హాజరై అడ్మిషన్లు పొందారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డా. రవి కుమార్, అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, అసోసియేట్ డీన్లు రాఘవరెడ్డి, నవీన్, ఉదయశ్రీ, హుస్సేన్, తిలక్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బి. లింగమూర్తి, ఐటీ ఇన్‌ఫ్రా కోఆర్డినేటర్ సంతోష్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డా. తిరుపతి రెడ్డి, వెల్ఫేర్ అధికారులు, అధ్యాపకులు బిన్నీ, ఓబయ్య, కోనప్ప, ఆర్కేవ్యాలి ఎస్సై శ్రీప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించడం

# అధికారుల బాధ్యత

### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



మహిళల సమస్యలు వింటున్న జగన్ మోహన్ రాజు

రాజంపేట, జూన్ 19 ప్రభాతవార్త : ప్రజాపాలన అంటే అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా ప్రజల సమస్యలను పరిష్కరించబడితేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. ప్రజలను తిప్పుకోవడం సరైన పద్ధతి కాదని అధికారులకు సూచించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినుతలు స్వీకరించారు. పలువురు మహిళలు, వృద్ధులు సమస్యలు పరిష్కరించాలని చమర్తికి వినతులు అందజేశారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు కూడా ప్రజల సమస్యలు పరిష్కరించాలని, అందుకే ప్రజాప్రతినిధులుగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి,సంక్షేమాలను రెండు కళ్ళుగా భావించి సమన్వయంతో పాలన సాగిస్తున్నామని చమర్తి తెలియజేశారు.అంతకుముందు భూ సమస్యలు, వీటితో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు,సామాజిక పెన్షన్లు,ఇండ్ల స్థలాలు, తాగునీటి ఇబ్బందులు, తదితర అంశాలపై ప్రజలు వినతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పార్టీ పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంగల్ రాయుడు, మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఈడిమడకల కుమార్, ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి,పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు , పార్టీ నాయకులు దాసరి కళాధర్,యూనిట్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ,మలిశెట్టి సుబ్బారాయుడు,సాతపల్లె జడ శివకుమార్, చినేపల్లి హరీష్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ బంగారంతో మోసాలకు పాల్పడుతున్న

# ఏడుగురు సభ్యుల ముఠా అరెస్ట్



మదనపల్లెక్రైం, జూన్ 19 ప్రభాతవార్త. భూమిలో దొరికిన బంగారం తక్కువ ధరకు ఇస్తామని నమ్మించి, కత్తులతో బెదిరించి ప్రజలను దోచుకుంటున్న ఏడుగురు సభ్యుల అంతర్ జిల్లా ముఠాను మదనపల్లి 2 టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు డి.ఎస్.పి పావని, టూ టౌన్ సీఐ మహమ్మద్ రఫీలు తెలిపారు. డిఎస్పి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు కి చెందిన డ్రైవర్ రాన్న చరణ్ (19), ప్లాస్టిక్ పూల దండల వ్యాపారి ఎం. వినోద్ కుమార్ (29), ఎం. రూక్ జాన్ అలియాస్ రూప్జన్ (35), రాన్న మల్లన్న (46), వీరబల్లి మండలం కు చెందిన శోమల్ చలపతి (70), రాణ కృష్ణబాబు (22), రాన్న పండి (46)లు జెసిబి పని చేస్తుండగా భూమిలో బంగారం దొరికిందని నమ్మించి, నకిలీ బంగారు పూసల దండలను అసలు బంగారంలా చూపించి మోసాలకు పాల్పడేవారు. జూన్ 10న బాధితులకు ఫోన్ చేసి, తమ వద్ద 3 కిలోల బంగారం ఉందని తక్కువ ధరకే ఇస్తామని నమ్మించారు. జూన్ 17న బాధితులు డబ్బుతో మదనపల్లి అన్నమయ్య సర్కిల్ వద్దకు రాగా, వారిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తులతో బెదిరించి నగదు లాక్కున్నారు. దీనిపై 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జూన్ 19న ఉదయం మదనపల్లి-రాయచోటి జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు ముద్దాయిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 2.8 కిలోల నకిలీ బంగారు పూసల దండ, 3 కత్తులు, మరియు టయోటా ఇన్నోవా కారు స్వాధీనం చేసుకుని, ముద్దాయిలను రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠాపై గతంలో కూడా రెండు కేసులు ఉన్నాయని, కేసులో ఇంకా కొందరు ముద్దాయిలను అరెస్ట్ చేయాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు.

## ఓటర్ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తున్న ఎస్ఐఆర్

వార్త 3వ పేజీలో

## తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై

# గత ప్రభుత్వం 140 అక్రమ కేసులు పెట్టింది

### తాము 5 కేసులు పెడితేచాలు వైసీపీ ఖాళీ : శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



పీలేరు జూన్ 19 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల్ని లొంగదీసుకోవాలని గత వైసీపీ ప్రభుత్వం పీలేరు నియోజకవర్గంలో 350 మంది పై 140 అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసిందని, అయినా ఒక్క కార్యకర్త కూడా టిడిపి వదిలి వెళ్ళలేదని, అక్రమ కేసుల్ని ధైర్యంగా ఎదుర్కొని పార్టీకి అండగా నిలిచి అధికారాన్ని అందించారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం అన్నమయ్య జిల్లా, పీలేరు పట్టణం, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం సూపర్ సిక్స్ సూపర్ హిట్" విజయోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలను వైసిపి లొంగదీసుకోవడం కోసం 140 కేసులు పెట్టాల్సి వచ్చిందని, తాము కేవలం ఐదు కేసులు పెడితే చాలు, పీలేరు నియోజకవర్గంలో వైసీపీ మొత్తం ఖాళీ అవుతుందని కిషోర్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వానికి అలాంటి కక్ష సాధింపు చర్యల స్వభావం లేదని అన్నారు. తాము ప్రజాబలంతోనే గెలవాలని నమ్ముతామని, నిజాయితీ రాజకీయాలతోనే ముందుకు పోతున్నామని ఆయన పేర్కొన్నారు. వైసీపీ నాయకులకు అభివృద్ధి అంటే తెలియదని, దోచుకో దాచుకో అన్న విధానంతో రాష్ట్రాన్ని దివాలా తీయించారని విమర్శించారు. వైసీపీ అక్రమ కేసులకు భయపడని కార్యకర్తలే మన బలం. అలాంటి కార్యకర్తల త్యాగాలతో వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని కాపాడుకుందాం. ప్రజలకు సేవ చేసే చంద్రబాబు పాలనకు, కూటమి పార్టీకి అండగా నిలబడదామని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని, వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడంతో యువతీ యువకులకు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. విధ్వంసం నుండి వికాసానికి.., శిథిలాల నుంచి శిఖరాలకు... నవ్యాంధ్ర నుంచి స్వర్ణాంధ్రకు రెండేళ్ల కూటమిపాలన తీసుకెళ్లిందని, నిండైన సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిరునామాగా నిలిచి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్లు, సింగల్ విండో అధ్యక్షులు, నియోజకవర్గ కూటమి నాయకులు, అధ్యక్ష కార్యదర్శులు అనుబంధ సంఘాలు ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు, అనధికారులు, మహిళలు, కార్యకర్తలు నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికి ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## జూన్ 21న నీట్ రీఎగ్జామ్..

# తీవ్ర ఒత్తిడిలో అభ్యర్థులు

### కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణా లోపమేనా? ఎన్టీఏ వైఫల్యంపై దేశవ్యాప్తంగా ఆగ్రహం

### తప్పు చేయని మెజారిటీ విద్యార్థులపై రీటెస్ట్ భారం ఎంతవరకు సమంజసం?

### లక్షలాది మంది వైద్య విద్యార్థుల కలలపై లీకుల్ల నీలి నీడలు!




ఎడ్యుకేషన్ జూన్ 19 ప్రభాతవార్త : దేశవ్యాప్తంగా వైద్య విద్య సీట్ల భర్తీ కోసం నిర్వహించే నీట్ పరీక్ష చుట్టూ ముసురుకుంటున్న వివాదాలు, పేపర్ లీకేజీల ఉదంతాల నేపథ్యంలో నేడు (జూన్ 21న) రీఎగ్జామ్ జరగబోతోంది. ఎంతో కష్టపడి, రాత్రింబగళ్లు చదివి డాక్టర్ కావాలని కలలుగనే లక్షలాది మంది మధ్యతరగతి, పేద విద్యార్థుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు పరీక్షల పారదర్శకతపై నమ్మకం సడలిపోతుంటే, మరోవైపు జాతీయ పరీక్షల సంస్థ మరియు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గత కొన్ని ఏళ్లుగా వరుసగా చోటుచేసుకుంటున్న లీకేజీల పరంపర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతోంది. బిహార్, గుజరాత్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో పరీక్షకు ముందే ప్రశ్నపత్రాలు చేతులు మారడం, వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షం కావడం, ఇందుకు సంబంధించి కోట్ల రూపాయల చేతులు మారడం వంటి దర్యాప్తు సంస్థల నివేదికలు దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఒక అత్యున్నత స్థాయి పరీక్షను ఇంత నిర్లక్ష్యంగా ఎలా నిర్వహిస్తారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

**తప్పు ఒకరిది.. శిక్ష అందరికా?**

దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థులు రాసిన పరీక్షలో, పేపర్ లీక్ కొన్ని ప్రాంతాలకు లేదా కొంతమందికే పరిమితమైతే, మొత్తం విద్యార్థులపై రీఎగ్జామ్ భారం మోపడం ఎంతవరకు న్యాయసమ్మతం అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. తప్పు చేయని లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ అనిశ్చితి భరించలేక మరికొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం గుండెల్ని పిండేస్తోంది. ఒకసారి పడినకష్టాన్ని మళ్లీ మళ్లీ అనుభవించడం, ..మిగతా 2వ పేజీలో

## నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం

**బద్వేలు అర్బన్, జూన్ 19, ప్రభాతవార్త :**

బద్వేల్ ప్రాంత పరిధిలో ఈనెల 21వ తేదీ జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు బద్వేలు డిపో మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి ఎక్స్ప్రెస్, అల్ట్రా పల్లె వెలుగు పల్లె వెలుగు బస్సులలో బద్వేలు బస్టాండ్ నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రయాణం చేయవచ్చు అన్నారు ఉదయం 8 గంటల నుంచి ఈ ప్రయాణం అందుబాటులో ఉండాలన్నట్లు తెలిపారు హెల్ప్ డెస్క్ ద్వారా మరిన్ని సలహాలు సూచనలు పొందవచ్చు అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## విద్యార్థుల భద్రతే లక్ష్యం నిబంధనలు పాటించాలి

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
### ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావు



**పులివెందుల, జూన్ 19, ప్రభాత వార్త**

విద్యార్థుల సురక్షిత ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని పులివెందుల పట్టణ ట్రాఫిక్ పోలీసులు ప్రైవేట్ పాఠశాలల బస్ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ మురళీ సూచనలతో ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాలలు పునఃప్రారంభ మైన నేపథ్యంలో స్కూల్ బస్సుల నిర్వహణ, రోడ్డు భద్రతా నియమాలు, విద్యార్థుల భద్రతపై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. విద్యార్థులను బస్సుల్లో ఎక్కించే సమయంలో, దింపే సమయంలో డ్రైవర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అలాగే బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి అన్ని ధ్రువ పత్రాలు చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. స్కూల్ బస్ ఫిట్‌నెస్ తో పాటు డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి కూడా ముఖ్యమని పేర్కొంటూ, పాఠశాల యాజమాన్యాలు డ్రైవర్లకు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనా లు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావు హెచ్చరించారు.

# తీవ్ర ఒత్తిడిలో అభ్యర్థులు

మొదటి పేజీ తరువాయి

కోచింగ్ సెంటర్ల ఫీజులు భరించలేక పేద తల్లిదండ్రులు అప్పులపాలు కావడం దేశంలో నిత్యకృత్యంగా మారింది.

**ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!**

పర్యవేక్షణ లోపం: వన్ నేషన్ వన్ ఎగ్జామ్ (ఒకే దేశం, ఒకే పరీక్ష) అంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను పక్కనబెట్టి నీట్ పరీక్షను ముందుకు తెచ్చింది. అయితే, దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో విద్యార్థులు రాసే ఈ పరీక్షను పటిష్టంగా నిర్వహించడంలో కేంద్ర విద్యాశాఖ, ఎన్టీఏ ఘోరంగా విఫలమయ్యాయి. పరీక్షల్లో అవకతవకలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సింది పోయి, మొదట్లో "లీకేజీలే జరగలేదు" అంటూ కేంద్ర మంత్రిత్వ శాఖలు కాలయాపన చేయడం వివాదాన్ని మరింత ముదిరేలా చేసింది. విద్యార్థులు వీధుల్లోకి వచ్చి పోరాడేవరకు, కోర్టులు మొట్టికాయలు వేసేవరకు కేంద్రం కదలకుండా ఉండిపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. కోట్లాది రూపాయల బడ్జెట్ ఉన్నప్పటికీ, ఒక పటిష్టమైన మరియు హ్యాకింగ్ లేదా లీకేజీలకు తావులేని సాంకేతిక, భద్రతా వలయాన్ని ఎన్టీఏ ఎందుకు ఏర్పాటు చేసుకోలేకపోయింది? ప్రైవేట్ ఏజెన్సీలు, ప్రైవేట్ పరీక్షా కేంద్రాలపై మితిమీరిన ఆధారపడటమే ఈలీకువీరులకు రాజమార్గం ఏర్పాటు చేసింది.

**నలిగిపోతున్న విద్యార్థులు - కుప్పకూలుతున్న నమ్మకం**

ప్రతిభావంతులైన విద్యార్థులకు రావలసిన సీట్లు, అక్రమ మార్గాల్లో లక్షలు కుమ్మరించిన వారికి దక్కడం సామాజిక న్యాయానికే గొడ్డలిపెట్టు. మొత్తానికి విగితి పరీక్షల భద్రతా వ్యవస్థలో లోపాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులోనైనా జాతీయ స్థాయి పరీక్షల విశ్వసనీయతను పునరుద్ధరించడానికి తీవ్రమైన సంస్థాగత మార్పులు అవసరం. ఇందుకోసం డిజిటల్ ప్రశ్నాపత్రాలు, బయోమెట్రిక్ ధృవీకరణ, మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పర్యవేక్షణ వంటి ఆధునిక సంస్కరణలను తక్షణమే అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లక్షలాది మంది యువత భవిష్యత్తుతో, వారి జీవితాలతో ఆడుకునే హక్కు ఏ ప్రభుత్వానికి లేదు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాలను అంగీకరించి, దేశ వైద్య విద్యారంగంలో పారదర్శకతను, పవిత్రతను కాపాడవలసిన బాధ్యత ఎంతైనా ఉంది. నేడు జరగబోయే రీఎగ్జామ్ అయినా ఎలాంటి ఆటంకాలు లేకుండా, పారదర్శకంగా జరుగుతుందా లేదా అన్నది చూడాలి.

## రాహుకాలాభిషేకానికి విశేష స్పందన



**బోయకొండ(చౌడేపల్లి), జూన్ 19 ప్రభాతవార్త**

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించిన రాహుకాలాభిషేకానికి దంపతుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. పలమనేరుకు చెందిన నవీన్ మిత్రబృందం అన్నదాన కార్యక్రమానికి ఉచితంగా కూరగాయాలను అందించారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, ఆలయ అధికారులు, అర్చక, సిబ్బంది భక్తులకు వసతులు సమకూర్చారు.

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు చేరేలా ప్రత్యేక సర్వే

### పలు గ్రామాల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ



**రామసముద్రం జూన్ 19 ప్రభాతవార్త**

మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్ రెడ్డి, మదనపల్లి నియోజకవర్గం వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నిసార్ అహ్మద్ ఆదేశాలతో మండల వైసీపీ అధ్యక్షులు కేశవ రెడ్డి, జడ్పీటీసీ రామచంద్రారెడ్డి, ఎంపిపి రమణారెడ్డి ఆధ్వ ర్యంలో శుక్రవారం మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె, ఆర్. నడింపల్లె చెంబకూరు, ఎలవానెల్లూరు గ్రామాల్లో సర్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించినట్లు మండల జడ్పీటీసీ సి హెచ్ రామచంద్రారెడ్డి, ఎంపిపి రమణారెడ్డి లు తెలిపారు, గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజలు సమస్యలు ఓటరు నమోదు సంబంధిత సందేహాలను తెలుసుకుని అవసరమైన సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో మండల వైసీపీ మైనారిటీ అధ్యక్షులు సర్దార్ బాషా, వైసీపీ యువ నాయకుడు హరి ప్రసాద్ నాయుడు, సి. సుబ్రహ్మణ్యం, స్వర్ణ గ్రామ సిబ్బంది బి. శారధ, వై. శ్వేత స్థానికులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ అవయవాల కోసం దరఖాస్తుల ఆహ్వానం



**కలికిరి, జూన్ 19, ప్రభాతవార్త:**

కృత్రిమ అవయవాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి భానుమూర్తిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరి మండలంలో కాళ్లు లేని వికలాంగులకు (కాళ్లు మాత్రమే) సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కాళ్లు లేన వికలాంగులు ఎవరైనా అవసరమున్న వారు గ్రామ సచివాలయానికి వెళ్లి మీ పేరును ఈనెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలని ఫ్రీడం టెస్ట్ చెన్నై వారు మీకు పరికరాలు అందజేస్తారన్నారు. మీరు సచివాలయానికి వెళ్లేప్పుడు ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ మరియు ఫొటోలు తీసుకొని మీ పేరు నమోదు చేసుకోవాలని వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఈపంట నమోదు పారదర్శకంగా చేపట్టాలి

### రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి
### వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి: ఏడీఏ ప్రభాకర్ రెడ్డి




**పులివెందుల, జూన్ 19 , ప్రభాత వార్త :**

రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా ఈ పంట నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి సూచించారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం సమావేశ మందిరంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఈపంట నమోదు, పారదర్శక ఎరువుల పంపిణీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ఈపంట నమోదు ఎరువుల పంపిణీ కార్యక్రమాలను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహిం చాలని తెలిపారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఎప్పటికప్పుడు ఈపంటలో నమోదు చేయాలని, అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ పంట నమోదు, ఎరువుల పంపిణీకి సంబంధించిన ఆన్‌లైన్ విధానంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రైతులకు సక్రమంగా సేవలు అందేలా సిబ్బంది సాంకేతిక విధానాలను సమర్థవంతంగా వినియోగించాలని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో చక్రాయపేట, వేంపల్లి, వేముల, పులివెందుల, లింగాల మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు. మండల వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాలగంగాధర్ రెడ్డి, ఓబులేసు, రమేష్, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారులు రాఘవేంద్ర రెడ్డి, దీప తదితరులు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లె మండల ఉపాధి హామీ పనులు ఆదర్శవంతం

### సెంట్రల్ టీం అధికారి అనిల్



**తంబళ్లపల్లె జూన్ 19 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మండలంలో గతంలో జరిగిన జెఎస్, జేబీలో చేపట్టిన ఉపాధి పనులు ఆదర్శవంతంగా ఉన్నాయని సెంట్రల్ నోడల్ ఆఫీసర్ అనిల్ ప్రశంసించారు. గత రెండు రోజులుగా అనిల్, డ్వామా జేఈ నాగరాజులు మండలంలోని కొటాల, ఆర్ ఎన్ తాండ, జుంజురపెంట, గోపిదిన్ని, గుండ్లపల్లి, దిగువపాలెం, గంగిరెడ్డిపల్లి, తంబళ్లపల్లె, ఎర్రసానిపల్లి, పంచాలమర్రి, ఎద్దులవారిపల్లి పంచాయతీలలో చేపట్టిన 90 జెఎస్, జేబీ ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీపిఎస్ లో చేపట్టిన ఉపాధి పనులు ట్రెంచీలు, ఫారం పాండ్స్, మొక్కలు పెంపకం పనులను అక్షాంశ, రేఖాంశల ద్వారా ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలో చేపట్టిన పనులు ఎక్కడ పారదర్శకత లోపం కానురాక పోవడం విశేషం. ఈ సందర్భంగా సెంట్రల్ నోడల్ ఆఫీసర్ అరుణ్ మాట్లాడుతూ మండలంలో చేపట్టిన 90 పనులను తనిఖీ చేశామని సక్రమంగా ఉన్నాయని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఇప్పటివరకు ఏడు మండలాల్లో 1211 జెఎస్, జేబీ పనులకు గాను 234 పనులను తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. మిగతా పనులను సైతం త్వరగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. వారి వెంట ఏపిఓ అంజనప్ప, ఈసీ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్లు సుజాత, బాల గంగాధర్, భూదేవి, క్షేత్ర సహాయకులు నరసింహులు, రమేష్, గోబ్రే నాయక్, రాణి, అశోక్, చాంద్ భాషా, వేమ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పలువురు వైసిపి నాయకులను పరామర్శించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



**పీలేరు జూన్ 19 ప్రభాతవార్త:**

మండలంలోని కాకులారం పల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన వైఎస్సార్సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీ గుండ్లూరు అమరనాథరెడ్డి, సోదరుడు గుండ్లూరు రమేష్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే కొత్తపల్లెకు చెందిన వైఎస్సార్సీపీ నాయకులు సురేష్ రెడ్డి తల్లి కాంతమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న పుంగనూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం కొత్తపల్లెకు చేరుకుని వారి ఇరువురుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి. వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి, నాయకులు భవనం వెంకట రమణారెడ్డి, మోహన్ రెడ్డి, శ్యాం ప్రసాద్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మధుసూదన్ రెడ్డి, జయచంద్రారెడ్డి. అమరనాథరెడ్డి, చక్రధర్, భువనేశ్వర్ రెడ్డి, షాకీర్, మునీర్, ఆబీద్, ద్వారకనాథరెడ్డి, కాలనీ చిన్న. వి.పి. రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలికిరి బస్టాండుకు రాని మదనపల్లి డిపో-2 బస్సులు

### ఇబ్బందుల్లో ప్రయాణికులు

కలికిరి, జూన్ 19, ప్రభాతవార్త: మదనపల్లి-తిరుపతికి వెళ్లే మదనపల్లి డిపో-2 బస్సులు కలికిరి ఆర్టీసీ బస్టాండుకు రాకుండా నేషనల్ హైవే గుండా తిరుపతికి, ఇటు మదనపల్లికి వెళ్లిపోతుండడంతో ప్రయాణికులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. కలికిరి క్రాస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండులో గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూస్తూ సకాలంలో ఇళ్లకు చేరలేక అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు మాత్రం బస్సులు ఆర్టీసీ బస్టాండుకు వెళ్లాలని ఆదేశాలున్నా మదనపల్లి డిపో-2 డ్రైవర్లు అధికారుల ఆదేశాలు పట్టించుకోలేదు. దీంతో కలికిరి ఆర్టీసీ బస్టాండు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఈ విషయంపై ప్రయాణికులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై రాష్ట్ర రవాణాశాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు ప్రయాణికులు పేర్కొన్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మదనపల్లి డిపో-2 బస్సులు కలికిరి ఆర్టీసీ బస్టాండుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలికిరి మండల ప్రజలు, ప్రయాణికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

## ద్విచక్ర వాహనం అదుపు తప్పి తీవ్రగాయాలు

### ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



**రామసముద్రం జూన్ 19 ప్రభాతవార్త:**

రామసముద్రం మండలం చెంబకూరు గ్రామ పంచాయతీకి చెందిన గురుప్రసాద్ పని నిమిత్తం కోలారు జిల్లా శ్రీనివాసపురం నుండి స్వంత గ్రామానికి బైక్ పై వస్తుండగా శ్రీనివాసపురం రోడ్డులో ఎలదాని వద్ద సోమవారం బైక్ అదుపుతప్పి రోడ్డు పై పడి తలకు తీవ్రంగా గాయపడ్డాడు, విషయం తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు వెంటనే కోలారు మెడికల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు, చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశాడని కుటుంబ సభ్యులు తెలిపారు, గురుప్రసాద్ ఆకస్మిక మరణం పట్ల గ్రామంలో విషాదం నెలకొంది, కుటుంబ సభ్యులు, స్నేహితులు మధ్య అతని అంత్యక్రియలు విషాద ఛాయాలు మధ్య ముగిసాయి.

# తగ్గుముఖం పట్టిన టమోటా ధరలు

మొదటి పేజీ తరువాయి

1181మెట్రిక్ టన్నులు టమోటాలు మార్కెట్‌కు వచ్చాయి. సాధారణంగా గతం లో టమోటాలు 500నుంచి 600ల మెట్రిక్ టన్నులు టమోటాలు మార్కెట్‌కు వచ్చేవి. అలాంటిది ఎక్కువ టమోటాలు వస్తుండడం వల్ల ధరలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎకరా టమోటా పంటను సాగు చేసేందుకు రూ.2నుంచి 3లక్షల వరకు ఖర్చు అవుతుంది. అలాం టిది ధరలు లేకపోవడం వల్ల రైతాంగం నష్టాల ఊభి లో కూరుకుపోతున్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు, రాయ చోటి నియోజకవర్గాల్లో టమోటా పంటను రైతులు ఏడాది పొడవునా జీవనా ధార పంటగా సాగు చేస్తారు. జిల్లాలో సుమారు 20వేల హెక్టార్లలో టమోటా సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు టమో టాను రబీ, ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. టమో టా వ్యాపారా లావాదేవీలకు మదనపల్లె మార్కెట్‌యార్డు రాష్ట్రంలోనే పేరు పొందింది. తగ్గిన ధరలతో రైతులకు సాగు చేసిన పెట్టుబడి కూడా చేతికి అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా ఎకరాలో డ్రిప్ ద్వారా, ఎరువులు, మేలురకం టమోటా పండించేందుకు రైతులు భారీగా ఖర్చు చేస్తున్నారు. ధరలు లేకపోవడం వల్ల పెట్టుబడి కూడా చేతికి రావడం లేదని ఆవేదన చెందుతున్నారు.

## ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేత



**కలికిరి, జూన్ 19, ప్రభాతవార్త:**

పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం సోమల మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, పరిగిదిన్నె పంచాయతీ మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం, బోయకొండ అమ్మవారి ఆలయ ఉద్యోగి తాతయ్యలు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోయకొండ అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు తప్పనిసరి

### ప్రత్యేక అధికారి యుగంధర్



**పీలేరు, జూన్ 19 ప్రభాతవార్త:**

ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు తప్పనిసరి అని డిప్యూటీ ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి యుగంధర్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత కుటుంబ సర్వే పూర్తి అయిందని, సర్వేలో తమ కుటుంబాల వివరాలు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సర్వేలో ఎటువంటి తప్పు ఒప్పులు ఉన్నా సరిదిద్దుకోవాలన్నారు. ఈ నెల 24వ తేదీ లోపు సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. సర్వే పూర్తి తరువాత ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు అందించనున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ కార్డు ఆధారంగా పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించి తమ కుటుంబ డేటా సరి చూసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దొరస్వామి, ఈవో బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ

### బైక్ ర్యాలీకి తరలిరండి



**రామాపురం జూన్ 19 ప్రభాతవార్త**

రాయచోటిలో శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఓటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల విజయోత్సవ సభ బైక్ ర్యాలీకి మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు గ్రామ అధ్యక్షులు మరియు టిడిపి అభిమానులు శనివారం ఉదయం 9 గంటలకు రామాపురం మండల నుండి బైక్ ర్యాలీతో తరలి వచ్చి రాయచోటి లో జరిగే విజయోత్సవ బైక్ ర్యాలీ మహాసభను విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షులు గాలివీటి సురేందర్ రెడ్డి కోరారు.

## ఫ్యామిలీ సర్వేలో అవకతవకలు ఉంటే సవరించుకోండి

**రామాపురం జూన్ 19 ప్రభాతవార్త**

గత డిసెంబర్ నెలలో గ్రామాలలో సచివాలయ సిబ్బంది యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే జరిగిందని ఈ సర్వేలో ఫ్యామిలీల పేర్లు నమోదులో తప్పులు ఉంటే సరి చేయడానికి శుక్రవారం సోషల్ ఆడిట్ గ్రామసభ చిట్లూరు సచివాలయంలో స్పెషలాఫీసర్ సులోచన ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ సులోచన మాట్లాడుతూ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో సిబ్బంది ఇంటింటికి వచ్చి సర్వే చేశారని ఆ సర్వే రిపోర్ట్ సచివాలయంలో నోటీస్ బోర్డు నందు ప్రదర్శించడం జరిగిందని కావున ఆయా గ్రామాల ప్రజలు తమ కుటుంబాలలోని పేర్లు కులము వయస్సు తదితర వాటిలో పొరపాట్లు పడి ఉంటే 19వ తేదీ నుండి 24వ తేదీ లోపల ఫిర్యాదు చేసుకోవాలని 26వ తేదీన ఫిర్యాదులు వచ్చిన వాటికి పరిష్కారం చేస్తామన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ సెక్రటరీ జగదీష్ కుమార్ సచివాలయ సిబ్బంది చిట్లూరు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జల జీవన్ మిషన్ తాగునీటి పనులకు సహకరించండి

### ఆర్డబ్ల్యూఎస్ డిఈఈ చంద్రశేఖర్ రెడ్డి



**తంబళ్లపల్లె జూన్ 19 ప్రభాతవార్త :**

ప్రభుత్వం ప్రతి ఇంటికి స్వచ్ఛ తాగునీరు అందించడానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలజీవన్ మిషన్ తాగునీటి సరఫరా పైప్ లైన్ పనులను అడ్డుకోరాదని ఈ సత్కార్యానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆర్డబ్ల్యూఎస్ డి.ఈ.ఈ చంద్రశేఖర్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం మండలంలోని కోటకొండ నుండి మండెంవారిపల్లెకు జలజీవన్ లో వేస్తున్న పైప్ లైన్ పనుల కాంట్రాక్టర్లను కొంతమంది రైతులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న డి ఈ ఈ చంద్రశేఖర్ రెడ్డి హుటాహుటిన ఎఈఈలు దినేష్ కుమార్, వినోద్‌కుమార్, డిపిఎం సంజయ్, జగన్నాథం, సైట్ ఇంజనీర్లతో సంఘటనా స్థలానికి చేరుకొని సంబంధిత అడ్డుకున్న రైతులతో మాట్లాడారు. జలజీవన్ తాగునీటి పథకం పై వారికి అవగాహన కల్పించి ఇలాంటి మంచి కార్యక్రమాలను అడ్డుకోరాదని చెప్పడంతో రైతులు చైతన్యం చెంది సంఘీభావం తెలపడంతో సమస్య సద్దుమణిగింది. ఈ సందర్భంగా డి ఈ ఈ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తయితే ప్రతి ఇంటికి స్వచ్ఛ తాగునీరు అందుతాయని ప్రజలు సైతం ఈ కార్యక్రమానికి సహకరించాలని సూచనలు చేశారు. అదేవిధంగా మండలంలో ప్రారంభమైన జలజీవన్ మిషన్ వాటర్ ట్యాంకుల నిర్మాణాలు నాణ్యత లోపం లేకుండా త్వరగా పనులు జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట కోటకొండ పంచాయతీలోని అధికార పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వెలుగు సంస్థలో వైద్యచికిత్సలు



**మదనపల్లె, జూన్ 19 ప్రభాతవార్త :**

పట్టణ సమీపంలోని అమ్మచెరువు మిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక సంస్థలో శుక్రవారం బొమ్మనచెర్వు వైద్య బృందం హెచ్ఐవి స్క్రీనింగ్ టెస్ట్ శిభిరాన్ని ఏర్పాటు చేశారు. బొమ్మనచెర్వు మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ పర్హాన్, సిహెచ్ఓ శ్రావణి, ఏఎన్ఎం కనకమ్మలు వెలుగు సంస్థలో దివ్యాంగులకు, వృద్ధులకు సుమారు 123మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ హెచ్ఐవి శరీరంలోని రోగ నిరోధక శక్తిని క్రమంగా బలహీన పరుస్తుందని దీని కారణంగా తరచూ జ్వరాలు, దగ్గు, విరేచనాలు, బరువు తగ్గడం, క్షయవ్యాధి, చర్మవ్యాధులు లాంటివి వస్తాయన్నారు. ఏఆర్‌టి మందులు సక్రమంగా వాడితే హెచ్ఐవి ఉన్న వ్యక్తులు కూడా ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ రెడ్డికుమారి, నిస్సి గ్రేసి, ఆశావర్కర్, వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ బాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## వైష్ణవీమాతా ఆలయంలో శుక్రవారం పూజలు



**పుదిపట్ల(చౌడేపల్లి), జూన్ 19 ప్రభాతవార్త**

మండలంలోని పంచాయతీ కేంద్రం స్వయంభు వైష్ణవీదేవీ ఆలయంలో శుక్రవారం సాంప్రదాయ బద్ధంగా పూజలు జరిగాయి. ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. ఆలయం ప్రాంగణంలోని నాగభైరవుడు, ఆంజనేయస్వామి వార్లను భక్తులు దర్శించుకొన్నారు. భక్తులకు ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## కనువిందు చేస్తున్న దేవతాపుష్పాలు

### సువాసన వెదజల్లుతున్న బ్రహ్మకమలాలు



**చౌడేపల్లి, జూన్ 19 ప్రభాతవార్త**

దేవతాపుష్పాలుగా పిలువబడే బ్రహ్మకమలాలు విరబూసి కనువిందు చేస్తున్నాయి. పట్టణంలోని కూరపర్తి శ్రీనివాసులు ఇంట బ్రహ్మకమలాల చెట్టు వుంది. ఆచెట్టు నిండా పుష్పాలు పూశాయి. ఆకు నుంచి మాత్రమే పూసే ఈ పుష్పాలు హిమాలయాల్లో పూస్తాయనీ, బ్రహ్మదేవుడు వీటిని ఆసనంగా కల్గివుండటం వల్ల బ్రమ్మకమలాలంటారని పండితులు అంటున్నారు. పరమశివుడికి ప్రీతిపాత్రమైన ఈ పుష్పాన్ని ఉత్తరాఖండ్ రాష్ట్రం జాతీయపుష్పంగా ప్రకటించింది. అంతేకాకుండా తపాలాశాఖ పుష్పం ఆకారాన్ని ముద్రించి అరుదైన గౌరవాన్ని ఇచ్చింది. రాత్రిళ్ళు మాత్రమే వికసించే బ్రహ్మకమలాలు సుగంధ వాసన వెదజల్లుతూ అందరినీ ఆకర్షిస్తున్నాయి.

## విజయోత్సవ మహా బైక్ ర్యాలీని విజయవంతం చేద్దాం

### గండికోట సుధాకర్

**రాయచోటి జూన్ 19 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం (జూన్ 20) నిర్వహించనున్న విజయోత్సవ మహా బైక్ ర్యాలీకి రాయచోటి రూరల్ మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువతతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం 9 గంటలకు రాయచోటి పట్టణంలోని శివాలయం సెంటర్, చెక్‌పోస్ట్ వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ ర్యాలీలో పాల్గొని సభా స్థలానికి చేరుకుంటారని పేర్కొన్నారు.

## కిల్ సెల్ అనీమియ ముక్త్ భారత్ సాదనే మన లక్ష్యం



**పీలేరు జూన్ 19 ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లాలోని కందూరులో స్థానిక పి. హెచ్. సి వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవం నిర్వహించడం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ కందూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో ప్రపంచ సికెల్ సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా ప్రజలకు, విద్యార్థులుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డి. హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ మాట్లాడుచు ఈ సంవత్సరము తీమ్ "జీవన అంతరాన్ని తగ్గించడం సికెల్ సెల్ వ్యాధిలో సమానత్వం "సికెల్ సెల్ అనీమియా రక్తపరీక్షలు సున్నా నుండి 40సంవత్సరాలలోపు ప్రజలు ముఖ్యంగా గిరిజన జాతులకు చెందిన వారు, ఎత్తయిన ప్రదేశాలలో నివసించే వారు, కొండ ప్రాంతాలలో అందరు చేయించుకోవాలని అన్నారు. గురువారం సికిల్ సెల్ రక్తహీనత పై 2047సంవత్సరానికి సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మిషన్ లో భాగంగా అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. సికెల్ సెల్ అనీమియా వ్యాధి వారస్వతంగా వచ్చే ఎర్ర రక్తకణముల వ్యాధి. ఈ జబ్బు తల్లిదండ్రుల నుండి జన్యుపరంగా పిల్లలకు వస్తుంది. సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి లక్షణాలు రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపు రంగు లోకి మారడం, తీవ్రమైన వళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవడం లో కష్టం, అలసట, తరచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భ ధారణ సమయం లో సమస్యలు, అవయవ వైపల్యం, పెరుగుదల సమస్యలు. ఈ వ్యాధి నిర్ధారణ కొరకు ప్రతీ ఆరోగ్య కార్యకర్త దగ్గర పరీక్ష కిట్స్ అందుబాటులో ఉన్నాయి. అవసరం ఐతే రక్తం ఎక్కించాలిసి వస్తుంది. వివాహనికి ముందు అమ్మాయి, అబ్బాయి ఇద్దరు సికిల్ సెల్ రక్త పరీక్షలు చేయించుకోవాళన్నారు. అనంతరం బ్రోచర్లు, కరపత్రాలు ఆవిష్కరణ చేసి పంపిణీ చేయడం, ఈ కార్యక్రమం లో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఎమ్. పి. హెచ్. ఈ. ఓ. కృష్ణయ్య పర్యవేక్షకులు ప్రమీల ఏ. ఎన్. ఎమ్ నౌషాద్, ఉపాధ్యాయులు లక్ష్మీపతి ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, SHAIK FARIDHA, W/o. SHAIK HIMAM VALLI, resident of D.No.93/67/1258, Indiranagar, Mamillapalli (P), C.K.Dinne (M), Y.S.R. Kadapa Dist.A.P. I declare that my daughter name previous Birth Certificate mention SHAIK MISBAH at Sukanya Samriddhi Yojana. Now I have changed my daughter name as SHAIK INAYA at New Birth Certificate also.

# ఓటర్ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తున్న ఎస్ఐఆర్

**బీహార్లో ఎస్ఐఆర్ తర్వాతే ఆక్రమాలు వెలుగులోకి వచ్చాయి**

**ఎస్ఐఆర్పై అవగాహన సదస్సులో డాక్టర్ బ్రహ్మ రెడ్డి**

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 19 ప్రభాతవార్త

ఈ దేశ ఓటర్ భవిష్యత్తును అత్యంత ప్రమాదంలోకి నెట్టేస్తున్న ఓటర్ సర్వే ఎస్ అయ్యారని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక నాయకులు బ్రహ్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎస్ఐఆర్పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ బ్రహ్మ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు ఎస్ఐఆర్ నిర్వహించిన రాష్ట్రాలలో కోట్లాదిమంది ఓటర్లను తొలగించారన్నారు. బీహార్లో ఎస్ఐఆర్ ముగిసిన తర్వాత ఫైనల్ లిస్టులో ఒక అడ్రస్లో 900 ఓటర్లు ఉన్నారన్నారు. కానీ తీరా అక్కడికి వెళ్లి చూస్తే ఒక్క ఓటరు లేరన్నారు. దీన్ని బట్టి ఎస్ఐఆర్ నిజంగా దొంగ ఓట్లను మరణించిన వారి ఓట్లనే తొలగిస్తుందని గ్యారెంటీ లేదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ ఎస్ఐఆర్లో 2002లో మీరు ఎక్కడ ఓటేశారు ఏ బూతులో వేశారు ఏ పార్ట్ నెంబర్ మీది అనే వివరాలతో సహా నేడు ఎన్నిమిరేషన్ ఫామ్ లో పూర్తి చేస్తేనే మీ ఓటింగ్ మ్యాపింగ్ అవుతుందన్నారు. లేకుంటే మీ ఓటు గల్లంతే అన్నారు. ఈ దేశంలో నాలుగవసారి అధికారంలోకి రావడానికి పాలక పార్టీ పండిన వ్యూహంగా ఎస్ఐఆర్ను రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జై భారత్ జాతీయ అధ్యక్షుడు లోక్నాథ్ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వ సురేష్, జిల్లా అధ్యక్షుడు పల్లవోలు రమణ, ప్రధాన కార్యదర్శి శివరాం, విరసం వరలక్ష్మి, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘం జిల్లా పూర్వ అధ్యక్షుడు శివచంద్రారెడ్డి, డా. నరసింహారెడ్డి, మురుకూటి సూర్యానారాయణ రెడ్డి, జమాతే ఇస్లాం రెహన, షఫీ, సిపి



యం సత్యం, సియంఐ రామయ్య, సుబ్బరాయుడు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దస్తగిరి రెడ్డి, మల్లేల భాస్కర్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య సృజన శ్రీను, నాగేంద్ర, రాయలసీమ మహిళా శక్తి లక్ష్మిదేవి, అడ్వకేట్ దాదాహయత్, హరిత, జెవివి రమణయ్య, పిళ్ళా కుమారస్వామి రెడ్డి, కవి మహమూద్, జింకా, స్నేహ సేవా సమితి మధు, వ్య.కా.సం. డేవిడ్, ఐద్వా ముంతాజ్, ఇన్నర్ వీల్ భారతి, ఉషారాణిసుబ్బయ్య, పోలంకి శ్రీరాములు, యల్లయ్య, రాజశేఖర్, నంగా రాజేష్, సునీత, గోపీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రజక విభాగం ముఖ్యనాయకుల సమావేశం

కడప కార్పొరేషన్ జూన్ 19 ప్రభాతవార్త:



గత 75 ఏళ్లుగా రజకులు సమస్యలతో సతమతమోతూ, ఇబ్బందులు ఎదుర్కొన్నారని వైఎస్ఆర్సీపీ రజక విభాగం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ లోగిడి జయన్న బాధను వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో రజకుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారం కోసం వైయస్సార్సీపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నేడు 20వ తేదీన ఉదయం 9 గంటలకు తాడేపల్లి లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో 175 నియోజకవర్గాల వారీగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రజక విభాగపు ముఖ్య నాయకుల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వైయస్సార్ సీపి రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి గారితో పాటు లేలా అప్పిరెడ్డి ఎమ్మెల్సీ, రమేష్ యాదవ్ లు హాజరవుతున్నారనీ వెల్లడించారు. కనుక పార్టీ వివిధ అనుబంధ విభాగాలు, కమిటీలలో కొనసాగుతున్న రజక సోదరులందరూ తప్పనిసరిగా సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.

## రేపు మన్నూరు హైస్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరం

రాజంపేట, జూన్ 19 ప్రభాతవార్త

రాజంపేట పట్నం మన్నూరు జడ్పీ హైస్కూల్లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తిరుపతి మారుతి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మాలేపాటి మారుతి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, షుగర్, బిపితో పాటు మోకాళ్ళ నొప్పులు తదితర రోగులకు కూడా ఉచితంగా వైద్య పరీక్షలు మందులు అందజేస్తామని తెలియజేశారు. అంతేకాకుండా ఈసీజీ, 2డి ఎకో, ఎముకల బలానికి సంబంధించిన పరీక్షలు కూడా ఉచితంగా చేస్తామన్నారు. రాజంపేట పరిసర ప్రాంత ప్రజలు ఈ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఆకాశం నుంచే పోలీసుల నిఘా..

**దాతల సహాయంతో సబ్ డివిజన్‌కు డ్రోన్ కెమెరా**



డ్రోన్ ప్రారంభిస్తున్న ఎఎస్పి రామ్నాథ్, దాతలు

రాజంపేట, జూన్ 19 ప్రభాతవార్త

రాజంపేట పోలీస్ సబ్ డివిజన్లో అసాంఘిక శక్తులపై ఇక పోలీసులు డ్రోన్ నిఘా పెట్టనున్నారు. భద్రతకు సాంకేతిక రెక్కలు తొడిగారు. పోలీసుల నిఘా ఇక డ్రోన్ కెమెరాతో జరగనుంది. ఈ మేరకు దాతల సహాయంతో రాజంపేట సబ్ డివిజన్ కు డ్రోన్ శుక్రవారం రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే ప్రారంభించారు. డ్రోన్ ఏర్పాటుకు సహకరించిన దాతలు కావుటూరి ఆదినారాయణ, లోకేష్‌లను ఆయన అభినందించారు. డ్రోన్ ప్రారంభించిన అనంతరం ఎఎస్పీ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో ఇక ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినా అంతు చూస్తామన్నారు. ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు పాల్పడుతున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. నిరంతరం డ్రోన్ ప్రయోగిస్తూ ఉంటామన్నారు. సబ్ డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో డ్రోన్ ద్వారా శాంతిభద్రతలు పర్యవేక్షిస్తామన్నారు. ట్రాఫిక్ ను కూడా కంట్రోల్ చేసేందుకు డ్రోన్ పనికొస్తుందన్నారు. ప్రధానంగా ఎక్కువ జన సమర్థత ప్రాంతాల్లో ఎలాంటి అరాచకాలు జరిగినా తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. పట్టణంలోని కీలక ప్రాంతాలపై నిరంతర నిఘా సాధ్యమవుతుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సాంకేతికతతో భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ నాగార్జున ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తా



ప్రిన్సిపాల్ నరసింహులును అభినందిస్తున్న సిబ్బంది

పులివెందుల, జూన్ 19, ప్రభాతవార్త :

పులివెందుల బి.ఆర్. అంబేద్కర్ గురుకుల కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా తెలుగు లెక్చరర్ సి. నరసింహులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల సొసైటీ సెక్రటరీ ఆదేశాల మేరకు ఇటీవల కర్నూలు జిల్లా అరికెర నుంచి బదిలీపై పులివెందులకు వచ్చిన సి. నరసింహులు, నేడు అధికారికంగా ఇంచార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సి. నరసింహులు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం, కళాశాల అభివృద్ధికి తోడ్పడటం, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. సిబ్బంది సహకారంతో కళాశాలను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సామర్థ్య వృద్ధి, నైపుణ్య అభివృద్ధి శిక్షణ

మైదుకూరు, జూన్ 19, ప్రభాతవార్త:

పురపాలక సంఘ పరిధిలోని శానిటరీ కార్మికుల కోసం స్థానిక స్త్రీశక్తి సమావేశ మందిరం నందు సామర్థ్య వృద్ధి మరియు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నాలెడ్జ్ పార్టనర్ అయిన ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహించింది. ఈ శిక్షణ కార్యక్రమంలో శానిటరీ కార్మికులకు పట్టణ శుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల వేరు చేయడం, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, ఆరోగ్య మరియు భద్రతా ప్రమాణాలపై సమగ్ర అవగాహన కల్పించారు. శానిటేషన్ రంగంలో మెరుగైన సేవలు అందించడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా





మునిసిపల్ కమీషనర్ వై. రంగస్వామి మరియు మెప్మా సి.ఎమ్.ఎమ్. కేజియా జాస్లిన్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎస్. పద్మావతి, హాజరై శానిటరీ కార్మికులు మైదుకూరు మున్సిపాలిటీ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వారు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అలాగే, శుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన పట్టణ వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం కార్మికులకు కమిషన్ రంగస్వామి ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శానిటరీ కార్మికులు శిక్షణ ద్వారా కొత్త విషయాలు నేర్చుకుని, తమ పనిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం మైదుకూరు మునిసిపాలిటీ శుభ్రత ప్రమాణాలను మెరుగుపరచడంలో ముఖ్యమైన కార్యక్రమం అని తెలిపారు.

## ప్రభుత్వ హాస్పిటల్ సేవలు వినియోగించుకోండి



సుండుపల్లె, జూన్ 19, ప్రభాతవార్త :

సంబేపల్లె మండలం నారాయణరెడ్డి పల్లె గ్రామం శ్రీనివాసపురంకు చెందిన సాకే. అక్షిత నాగార్పమ్మా జాతర సందర్భం గా సుండుపల్లెకి వచ్చారు. 30 వారాలకే నొప్పులు ఎక్కువ అవడం వల్ల సుండుపల్లె ప్రభుత్వ హాస్పిటల్ కు వచ్చారు. డాక్టర్లు మరియు స్టాఫ్ నర్సు బాష పరీక్షించి నార్మల్ డెలివరీ చేసారు. 1.4kgs ఆడబిడ్డ జన్మించింది. ఊపిరి తీసుకోవటానికి ఇబ్బంది పడుతున్న బిడ్డకి డాక్టర్ దిలీప్ చిన్న పిల్లల డాక్టర్ ఎమర్జెన్సీ వైద్యం అందించిన తరువాత తండ్రి I. C. U వైద్యం కోసం బిడ్డను రాయచోటి లోని పెద్ద ఆసుపత్రి కీ తరలించారు. 10 రోజుల ICU వైద్యం తరువాత బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ దిలీప్ మరియు డాక్టర్ ఫర్హాన్ ఖానం తెలిపారు. తల్లి పిల్లల వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్ళకుండ ఇప్పుడు మన సుండుపల్లె ప్రభుత్వ హాస్పిటల్ నందు సేవలు వినియోగించు కోవాల్సింది గా డాక్టర్లు మండల ప్రజలకు తెలియచేసారు.

## సిద్ధవటం వైద్యశాల ఆకస్మిక తనిఖీ



సిద్ధవటం, జూన్ 19 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం కడపజిల్లా కమ్యూనిటీ హెల్త్ సూపరిడెంట్ అధికారి హిమదేవి తనిఖీ చేపట్టి వైద్య సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు, వైద్యశాలలోని అన్ని విభాగాల గదులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యశాల ఆవరణంలో అపరిశుభ్రత లేకుండా చూడాలని రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని రోగులకు మెరుగైన సేవలు అదే విధంగా వైద్య సిబ్బంది సహకరించాలని వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపమని పోస్టుమార్టం గది నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకొని అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ చిరంజీవి రెడ్డి, డాక్టర్ ప్రకాష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 21న నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి పురస్కారాలు

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 19 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ కళా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21 ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక వసంతపేటలోని శ్రీ చౌడేశ్వరి దేవి తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి పురస్కారాలు అందజేస్తున్నట్లు శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కంభం పాములేటి ఒక ప్రకటనలో తెలిపారు. వైభవోపేతంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు.

## మొహరం సందర్భంగా కొలువుతీరిన పీర్లు

ముద్దనూరు, జూన్ 19 (ప్రభాతవార్త):



మొహరం పండుగ సందర్భంగా ఈ నెల 24 నుంచి 27 వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 24వ తేదీ చిన్న సరిగట్లు, 25వ తేదీ పెద్ద సరిగట్ల పూలతో తిరుగుడు కార్యక్రమాలు జరగనున్నాయి. 26వ తేదీ విదిదినం సందర్భంగా సాయంత్రం జేఎంఆర్ మైదానం వద్ద అబ్దుల్ ఖాదర్ (ఫేమస్ బ్రదర్స్) ఆధ్వర్యంలో వందలాది స్వాములవారికి చదివింపులు నిర్వహించి, పూల పీర్లను ఊరేగింపుగా పీర్ల చావిడికి తీసుకెళ్లనున్నారు. అనంతరం గుండం కాల్చే కార్యక్రమం నిర్వహిస్తారు. 27వ తేదీ తెల్లవారుజామున గుండములో పీర్ల దిగుడు కార్యక్రమం, మధ్యాహ్నం పీర్ల యేటికి (ముక్కు) పోవు కార్యక్రమం నిర్వహించనున్నారు.

## బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఎడ్యుకేషన్ జూన్ 19 ప్రభాతవార్త :

విద్యాశాఖ నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలలో బదిలీ పొంది, రిలీవర్ లేని కారణంగా అదే పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయులను తక్షణం రిలీవ్ చేసి, వారు బదిలీ పొందిన స్థానానికి పంపాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ కోరారు. శుక్రవారం ఉదయం కడపలోని జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో డిఈవో షేక్ షంషుద్దీన్ ను కలిసి యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన వినతి పత్రం సమర్పించారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు ప్రాతినిధ్యాలు చేసినా సరైన స్పందన లేదని ఆరోపించారు. ప్రస్తుతం విద్యాశాఖ జూన్ 20వ తేదీని ప్రాతిపదికగా తీసుకొని పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల రేషనలైజేషన్ నిర్వహించి, ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను చేపట్టనున్నందున, పని సర్దుబాటు ప్రక్రియ కంటే ముందుగానే బదిలీ పొంది రిలీవర్ లేక అదే పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయులను వారు బదిలీ పొందిన స్థానానికి రిలీవ్ చేసి పంపాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు హై స్కూల్ ప్లస్‌లలో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీకి నోచుకోక విద్యా బోధనకు ఆటంకం ఏర్పడి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలల తనిఖీ



ఒంటిమిట్ట జూన్ 19 ప్రభాతవార్త

ఒంటిమిట్ట మండలం రాచపల్లి, రాచగుడిపల్లి మెయిన్, హరిజనవాడ, ఇబ్రహీంపేట, నరసన్నగారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి వల్లూరి బ్రహ్మయ్య తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఆయన పాఠశాలలలోని రికార్డులను, పరిసరాలను, ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే నోట్ బుక్ లను, పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్ పంపిణీపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం కింద పాఠశాల అవసరాలకు, అభివృద్ధికి పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ వారి సహాయ సహకారాలతో చేపట్టాలని సూచించారు. సమగ్ర శిక్ష కింద మంజూరైన నిధులతో నరసన్న గారి పల్లె పాఠశాలలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. చెప్పిన సమయం ప్రకారం నాణ్యతతో మరుగుదొడ్ల నిర్మాణం చేయాలన్నారు. రాచపల్లి పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 9, 10 తరగతిల విద్యార్థినిలకు బాల్య వివాహాలపై పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఎక్కడైనా బాలవివాహాలు నిర్వహిస్తూ ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## వేములూరు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

బద్వేలు, జూన్ 19, ప్రభాతవార్త

అట్లూరు-సిద్ధవటం అటవీ ప్రాంతంలో ప్రజల భద్రత కోసం రోడ్డుకు ఇరువైపులా ఎత్తైన ఫెన్సింగ్ నిర్మించాలని, వేములూరు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఒక నియోజకవర్గం - ఒక నెల - నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అట్లూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవోకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ అట్లూరు-సిద్ధవటం అటవీ ప్రాంతంలో అడవి జంతువుల సంచారం, ప్రమాదాల కారణంగా ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, కేవలం రూ.2 కోట్ల నిధులు కేటాయిస్తే శ్రీశైలం, మాలకొండ అటవీ ప్రాంతాల తరహాలో రహదారికి ఇరువైపులా ఎత్తైన ఫెన్సింగ్ నిర్మించవచ్చన్నారు. అడవిలో సీసీ కెమెరాల ఏర్పాటు, కలివికోడి పేరుతో గతంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న నిధుల దుర్వినియోగంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, నియోజకవర్గ కమిటీ సభ్యులు విజయరావు, కె. బాబు, గంటా మహబూబ్ బాషా, ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు శిఖామణి, విప్లవ యువజన సంఘం నాయకులు ఈశ్వర్, సలీం తదితరులు పాల్గొన్నారు.



## పల్స్ పోలియో విజయవంతానికి శిక్షణ



బద్వేలు అర్బన్, జూన్ 19, ప్రభాతవార్త:

28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి స్థానిక ఎన్జీ హోంలో డాక్టర్ ఈ. మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బూత్ వాలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి వి. మల్లేష్ మాట్లాడుతూ, 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా చూడాలని, తొలి రోజు పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలకు రెండో రోజు ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయాలని తెలిపారు. గాంధీనగర్ వైద్యాధికారి పి. శరత్ చంద్ర మాట్లాడుతూ, హైరిస్క్ ప్రాంతాల్లో నివసించే చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్వైజర్ వి. శివరామిరెడ్డి మాట్లాడుతూ, గోపవరం మండల పరిధిలో 48 పోలియో బూతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పల్స్ పోలియో కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ కె. విజయకుమారి, సూపర్వైజర్ ఎల్లమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బూత్ వాలంటీర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



బద్వేలు అర్బన్, జూన్ 19, ప్రభాతవార్త

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా సమర్థవంతమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక - ఒక నియోజకవర్గం, ఒక నెల, నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బద్వేల్ నియోజకవర్గంలోని అట్లూరు మండలంలో కొండూరు గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ షిరిడి సాయి కళ్యాణ మండపంలో బద్వేల్ డివిజన్ ఆర్డీవో చంద్రమోహన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కడప జిల్లా డీసీసీబీ బ్యాంకు ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 92 మంది అర్జీదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

## ఎస్ఐఆర్పై అవగాహన

బద్వేలు అర్బన్, జూన్ 19, ప్రభాతవార్త

పట్టణంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్ )అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ కడప జిల్లా అధ్యక్షులు పి, చాంద్ భాషా, బద్వేల్ పట్టణం ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్ ,అబ్దుల్ సత్తార్, మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్.లో జరుగుతున్న సర్వేలకు హేతుబద్ధంగా నిర్వహించి అర్హుడైన ప్రతి భారతీయునికి ఓటు హక్కు కల్పించాలన్నారు. బి.ఎల్.ఓ.లు సర్వే లెక్కలు తీసుకునేటప్పుడు ఆధార్, ఓటర్ కార్డులు అందరి దగ్గర ఉంటాయి కాబట్టి కనీస ప్రామాణికంగా చూడాలని వారు కోరారు. పేదల, అణగారిన వర్గాల, చదువులు, ఆస్తులు లేని వారి ఓట్ల హక్కులను కోల్పోయే పరిస్థితిని తీసుకోనిరాకూడదని వారు తెలిపారు. బతుకుతెరువు కోసం వలస కార్మికులుగా వెళ్లినవారు, ఇతర దేశాలకు ఉపాధి కోసం తరలిన వారిని ఇరుగుపొరుగు వారిని విచారించి జన్మస్థలమైన స్థానికంగానే ఓట్లు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యువ నాయకులు ఎస్, మాహీర్, ఆవాజ్ నాయకులు మహమ్మద్అలీ, నాగూర్, కరిముల్లా, ఖాదర్ భాష, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల సవరణ పక్రియను సద్వినియోగం చేసుకోవాలి



వేంపల్లె జూన్ 19 ప్రభాతవార్త

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పక్రియను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి కోరారు. బుధవారం బిఎల్ఓ లతో పాటు నాయకులు కార్యకర్తలు ఆయా వార్డుల్లో ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చెయ్యాలని కోరారు. అనంతరం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పక్రియ గురించి ప్రజలకు అవగాహన కల్పించ్చాలన్నారు ప్రతి బిఎల్ఓ తమ పరిధిలోని ప్రతి ఓటరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హత కలిగి ఉన్న ఓటర్ల పేర్లు చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బిఎల్ఓ లకు సూచించారు. ఓటర్లకు అవగాహన కల్పిస్తూ పలు సందేహాలను నివృత్తి చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఎస్ఐఆర్ పక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే అధికారులు, బూత్ కమిటీ సభ్యులు సమన్వయం చేసుకుంటూ మ్యాపింగ్ ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ, మేరీ, మాజి వార్డు మెంబర్ రత్నం, దస్తగిరి, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

## 29న ఛలో కడప జయప్రదం చేయండి



జమ్మలమడుగు, జూన్ 19, ప్రభాతవార్త:

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బి.మఠం మండలంలో జరిగిన మాదిగ యువకుల జంట హత్యల కేసును నిగ్గు తేల్చి దోషులను చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న ఛలో కడప కార్యక్రమానికి వేలాది ప్రజలు తరలవచ్చి జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ పలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్బీ అతిథి గృహంలో జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల అత్యవసర సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా.మున్నంగి నాగరాజు మాదిగ పాల్గొని ఛలో కడప కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దొమ్ము చిన్న మాదిగ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య మాదిగ, ముద్దనూరు మండల ఇన్‌ఛార్జి కె.గంగరాజు, కొండాపురం మండల ఇన్‌ఛార్జి జి.తులసీ రాముడు, జమ్మలమడుగు మండల ఇన్‌ఛార్జి ఎం.హరికృష్ణ, పెద్దముడియం మండల ఇన్‌ఛార్జి ఓబులేసు, మైలవరం మండలం నుంచి బొంతల ఓబులేసు, ఎర్రగుంట్ల మండల ఇన్‌ఛార్జి రవీంద్ర, సీనియర్ నాయకులు వెంకట సుబ్బయ్య, దస్తగిరి, నాగన్న, సుబ్బరాయుడు, సహదేవుడు, గంగాధర్, బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## 28, 29, 30 తేదీల్లో పల్స్‌పోలియో

పెండ్లిమర్రి, జూన్ 19, ప్రభాతవార్త:

నందిమండలం ప్రాథమిక కేంద్రంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే పల్స్ పోలియో కార్యక్రమంపై డా.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించేందుకు సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.చెన్నారెడ్డి, డా.నిఖిలేశ్వరి, ఆరోగ్య విస్తరణాధికారి రామప్రతాప్, సూపర్‌వైజర్ రవీంద్రనాథ్‌లు పాల్గొన్నారు.



## ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' పాటించాలి



**పులివెందుల, జూన్ 19 , ప్రభాతవార్త :**

మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు ప్రజలు ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య సూచించారు. యాంటీ మలేరియా మాసోత్సవంలో భాగంగా పులివెందుల పట్టణంలోని దర్గా వీధిలో శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేపట్టారు. నివాసాల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి దోమల లార్వాలను గుర్తించారు. లార్వా వృద్ధి చెందకుండా తగిన నివారణ చర్యలు చేపట్టారు. అనంతరం ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం నీటి నిల్వలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించాలని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శేషగిరి నాయక్, సౌభాగ్యమ్మ, ప్రభావతి, ఆశా కార్యకర్త సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మ్యూజిక్ రంగంలో రాణించాలి :ఎమ్మెల్యే



సన్మానిస్తున్న దృశ్యం

**మదనపల్లె, జూన్ 19 ప్రభాతవార్త :**

విద్యార్థులు విద్యతో పాటు మ్యూజిక్ రంగంలో రాణించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని విజయభారతి ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్‌లో కేరీర్ గైడెన్స్ వర్క్‌షాపు లైవ్ పర్ఫామెన్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో విద్య, క్రీడలతో పాటు మ్యూజిక్‌ను ప్రోత్సహిస్తున్న ఏకైక విద్యాసంస్థ విజయభారతి స్కూల్ అన్నారు. బెంగుళూరుకు చెందిన ప్రముఖ ఫ్లూటిస్ట్ అర్జున్ ఎంపిఎన్, యోదునందన్ నాగరాజులను శాలువతో సన్మానించి బహుమతి అందజేశారు. విద్యార్థులు నైపుణ్యతతో కూడిన విద్యను అభ్యసించి సాఫ్ట్‌వేర్, వ్యాపారం, క్రీడల వంటి వాటిని గమ్యంగా ఎంచుకోవాలన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ సేతు మాట్లాడుతూ విద్యాసంస్థకు విచ్చేసిన వీరు ఇద్దరు పేరు ప్రఖ్యాతలు పొందిన వారు మనకోసం ఇక్కడికి వచ్చి ఉచితంగా కార్యక్రమాన్ని నిర్వహించడంపై కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు డాక్టర్ అజంతుల్లాఖాన్, శ్రీచందు, మనోహర్‌నాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



**బద్వేలు అర్బన్, జూన్ 19, ప్రభాతవార్త**

పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవడం వలన, ఆరోగ్యంగా ఉండవచ్చని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి బి .వెంగయ్య అన్నారు. శుక్రవారం బద్వేల్ మండలం, జోగి రెడ్డి గారి పల్లెలో ,ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది ఫీవర్, లార్వా, ఇంటింటి సర్వే జరిగింది జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలు వీధులలో బ్యానర్లు చేత పట్టి, దోమలు పుట్టకూడదు, కుట్టకూడదు, పరిసరాలను శుభ్రంగా పెట్టుకోండి, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం చేయించుకోండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంగయ్య మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలని, నీరు నిలువ లేకుండా చేసుకోవాలన్నారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులను నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పు కావాలని, అందుకు తగ్గట్టు, మెరుగైన సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు పోయి వేల రూపాయలు డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. 104, 108, విలేజ్ హెల్త్ క్లినిక్లు, అవసరమైన చోట మెడికల్ క్యాంపులను నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, సిహెచ్‌ఓ వీణ, ఏఎన్‌ఎం దీపిక, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### చెత్త నుండి సంపదను తయారు చేసే

## కేంద్రాన్ని తనిఖీ చేసిన డిజిపిఓ

**నిమ్మనపల్లి జూన్ 19 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండల కేంద్రంలో డీజీపీవో రాధమ్మ ముఖ్య రహదారిలో చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లతో ముఖా ముఖి మాట్లాడుతూ చెత్త సేకరణ విధానం,తడి పొడి చెత్త బిన్ బ్యాగ్ పద్ధతిలో తీసుకొని ట్రాక్టర్ ద్వారా కేంద్రానికి తరలించడం. అక్కడ యే విధంగా తొట్టిలలో వేరు వేరుగా చెత్త నింపిన పరిస్థితిని గమనించారు. ప్రాంగణంలో సాధ్యమైనంత మెరుగైన పారిశుద్యం ప్రక్రియకు చర్యలు చేపట్టాలని ప్రక్కనే వారపు సంత స్థలంలో శుభ్రతా కార్యక్రమం మరింతగా బాగు చేసి, త్రాగు నీరు సరఫరా, మరుగుదొడ్లు నిర్వహణ బాగుండాలని పీడీఓ రెడ్డిప్రసాద్ ని ఆదేశించారు. అనంతరం రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీ చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ను తనిఖీ చేస్తూ డీజీపీవో ఎ రాధమ్మ ప్రతి రోజూ గ్రామాలలో ఇంటింటికి గ్రీన్ అంబాసిడర్లు తిరిగి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి బిన్ బ్యాగ్ పద్ధతిలో తీసుకొని తడి చెత్తలోని తొట్టిలలో వేసి కుళ్ళిన పిమ్మట వర్మి తొట్టెలో వాన పాములు వదిలి వర్మీ తయారు చేయు విధంగా చర్యలు చేపట్టాలని పీడీఓ గాయత్రిని ఆదేశించారు. చెత్త సేకరణ మరియు స్వచ్ఛ రథం గురించి ప్రభుత్వం ద్వారా వస్తున్నాయి ప్రజానీకానికి అవగాహన కల్పించి 90% పైన ప్రగతి తేవాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫక్రుద్దీన్ సాహెబ్,డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఎవో రమేష్‌బాబు డిప్యూటీ ఎంపీడీఓ (స్వర్ణ గ్రామం) లక్ష్మీపతి, పీడీఓలు రెడ్డి ప్రసాద్, గాయత్రి, రిసోర్స్ పర్సన్ నాగరాజు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఉపాధి కోసం నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలి

**పీలేరు జూన్ 19 ప్రభాతవార్త:**

డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ కోర్సు పూర్తయిన తక్షణమే ఉపాధి పొందేందుకు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జి రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం పీలేరు మార్గదర్శి డిగ్రీ కళాశాలలో ఆమె విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ డిగ్రీ చదివిన వారు ఎక్కువగా ఉన్నందున మంచి కంపెనీలలో ఉద్యోగాలు పొందేందుకు ఇంటర్వ్యూల సమయంలో వారిని సంతృప్తిని పరిచేందుకు శిక్షణలు ఉపయోగపడతాయని అన్నారు. గత ఏడాదిలో జిల్లాలో 250 మంది కి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగాలు పొందాలని చెప్పారు. వాళ్లకు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ముందు అవగాహన కార్యక్రమం లేదా శిష్యుల కార్యక్రమం జరుగుతుంది. ఈ శిక్షణ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా అందేందుకు త్వరలో గ్రామీణ స్థాయిలోనూ సదస్సులను నిర్వహించి స్కిల్ డెవలప్మెంట్ తగిన సూచనలు ఇస్తామని అన్నారు. జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

రూ.30000 వేతనంగా లభిస్తుందని అన్నారు. నెక్స్ట్ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎంపికైన వారికి భోజన వసతి కల్పించి కూడా శిక్షణలు ఇస్తామని అన్నారు. ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన వారికి స్థానికంగానే ఉన్న కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ డబ్ల్యూ ఓ కృష్ణ,, సంక్షేమ అధికార్లు కుసుమ మాధవి రాజేంద్ర రమాదేవి లత, ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకటసుబ్బయ్య చంద్రశేఖర్ రాకేష్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి నవమ వార్షికోత్సవం

**కలసపాడు, జూన్ 19 ప్రభాతవార్త:**

మండలంలోని గోపారం పల్లె గ్రామంలో సీతారామస్వామి ఆంజనేయస్వామి సీతాలమ్మ దేవత నవమ వార్షికోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం గంగాయానం, కలశ స్థాపన, గణపతి పూజ తదితర కార్యక్రమాలు పూజారి రమణయ్య స్వామి ఘనంగా నిర్వహించారు. వచ్చినటువంటి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



## వెట్టి చాకిరిని ఉపేక్షించం : ఏఎస్పీ



**నందలూరు, జూన్ 19 ప్రభాతవార్త :**

కూలీలతో వెట్టి చాకిరి చేయించడం, వారిని అక్రమంగా నిర్బంధించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే హెచ్చరించారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లెలోని ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో చేపల యజమానులు, కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలను పనిలో చేర్చుకునే ముందు వారి పూర్తి వ్యక్తిగత వివరాలు సేకరించడంతో పాటు కుటుంబ సభ్యుల అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే వారి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కూలీలను బలవంతంగా పని చేయించడం, స్వేచ్ఛను హరించడం, అక్రమంగా నిర్బంధించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను గౌరవిస్తూ చట్టబద్ధంగా వ్యవహరించాలని యజమానులకు సూచించారు. వెట్టి చాకిరి లేదా కార్మికులపై వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు అందితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, చేపల యజమానులు, కూలీలు పాల్గొన్నారు.

## ఓట్ల పునర్వ్యవస్థీకరణ ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రమేష్ నాయుడు

**రాజంపేట, జూన్ 19 ప్రభాతవార్త**

ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రతీ కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు కోరారు. శుక్రవారం స్థాని జిఎంసి కళ్యాణమండపంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమము జిల్లా కార్యదర్శినరేంద్ర రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి కడప జిల్లా అధ్యక్షులు జంగిటి సుబ్బారెడ్డి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఎస్ఐఆర్ కార్యక్రమం రాయలసీమ ఇంచార్జ్ జల్లి మధుసూదన్, రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం బూతు స్థాయి నాయకులు అందరూ కూడా అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో కూడా నిజమైన భారతీయ పౌరులకు ఓటు హక్కు కలిగేటట్లు, పౌరులు కాని వారికి, చనిపోయిన వారికి, రెండు చోట్ల ఓటు ఉన్నవారికి, ఒకే ఇంట్లో అధిక ఓట్లు ఉన్న వారిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొల



ఎస్ఐఆర్ బిజెపి కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నేతలు

గించే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. అలాగే నిజమైన ఓట్లకు న్యాయం జరిగే విధంగా వ్యవహరించాలని ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో మోటర్‌తో అనుబంధం ఏర్పరుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పోతు గుంట నాగేశ్వరరావు, మైనార్టీ మోర్చా నేత షబ్బీర్, మహేష్ రాజు,స్థానిక నాయకులు చొప్ప వెంకట్ రెడ్డి, కృష్ణ హిమగిరి కార్యకర్తలు పాల్గొన్నారు.

### గ్యాస్, వంటనూనెలను పొదుపుగా వాడి

## దేశ సంపదను కాపాడాలి

### బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ



**వేంపల్లె: జూన్ 19 ప్రభాతవార్త**

దేశ ఆర్థిక పరిరక్షణలో మహిళలను భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పట్టణంలో వంట గ్యాస్, వంటనూనెల పొదుపు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ మాట్లాడుతూ వంట గ్యాస్, వంటనూనెలను మన దేశం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుందని, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో వాటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వేంపల్లె మహిళలతో తక్కువ గ్యాస్, తక్కువ నూనె వినియోగంతో వంటలు తయారు చేసే పోటీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో మహిళలు వివిధ రకాల వంటకాలను ప్రదర్శించగా, తక్కువ గ్యాస్, తక్కువ నూనె వినియోగించిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం బీజేపీ మహిళా నేతలు కవిత, సౌభాగ్య, సుమతి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యకరమైన వంట పద్ధతులను పాటిస్తూ కుటుంబ ఆరోగ్యంతో పాటు దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. మహిళలు వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, సమాజ సేవకులుగా ఎదిగి దేశ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, బీజేపీ నాయకులు సుమన్, సునీల్, ఈశ్వర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేష్.



**ముద్దనూరు, జూన్ 19 (ప్రభాతవార్త):**

మండలంలోని యామవరం గ్రామానికి చెందిన చిన్నారి జన్యు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, అతని చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.9 లక్షల ఆర్థిక సహాయం అందింది. గత నెల 22వ తేదీన జమ్మలమడుగు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన మంత్రి లోకేష్‌ను చిన్నారి తల్లిదండ్రులు కలిసి తమ కుమారుడి ఆరోగ్య పరిస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.9 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ఆ సహాయానికి సంబంధించిన చెక్కును కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పార్టీ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ విజ్ఞప్తికి స్పందించి ఆర్థిక సహాయం అందించిన మంత్రి లోకేష్‌కు, చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## యుఎఫ్ఎస్ పై గ్రామసభ

**దువ్వూరు, జూన్ 19, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులోని 1, 2 సచివాలయాల్లో శుక్రవారం ఇటీవల నిర్వహించిన యునైటెడ్ ఫ్యామిలీ సర్వే పై గ్రామసభలు నిర్వహించారు. గతంలో మండలంలోని సచివాలయ సిబ్బంది, ఇతరులందరూ కలిసి యుఎఫ్ఎస్ఐ సర్వే నిర్వహించారు. ఆ సర్వేకు సంబంధించి తుది జాబితా రావడంతో సభ నిర్వహించినట్లు ఎంపీడీవో సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ గ్రామ సచివాలయం నందు ఎంపీడీవో అధ్యక్షతన ఈ సమావేశం జరిగిందని, ఈ సమావేశంలో ఫ్యామిలీ సర్వేలో ఏ కుటుంబానికి సంబంధించిన తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ఈనెల 24వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఇళ్లకు సంబంధించిన జాబితాను దువ్వూరు1, 2 సచివాలయాల్లో ప్రదర్శించామని ప్రజలు ఎవరైనా వెళ్లి చూసుకొని తప్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. ఈ సభలో డిప్యూటీ ఎంపీడీవో వెంకట రమణారెడ్డి, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సత్యవాణి, వీఆర్వోలు జోహరుద్దీన్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఆలోచన చిన్నదే సృజనాత్మకత పెద్దది

### రాష్ట్రస్థాయి ఇన్ స్పైర్ కు ఎంపికైన సింధు

**చౌడేపల్లి జూన్ 19 ప్రభాతవార్త**

సరికొత్త ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే అద్భుతమైన నమూనాను ప్రదర్శించి ఓ విద్యార్థిని ఘనత సాధించింది జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో తన ప్రతిభను చాటి ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న టి సింధు జీవశాస్త్ర ఉపాధ్యాయుని రెడ్డి భాగ్యాంబ పర్యవేక్షణలో రూపొందించిన డేంజగర్ అవెర్టింగ్ డాల్ అనే నమూనా ప్రదర్శించింది ఈ నమూనా రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక అయిందిదీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ బాలికను అభినందించారు గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఇంతటి ప్రతిభ దాగి ఉందనడానికి సింధు నిదర్శనమని అన్నారు రాష్ట్ర స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికాయి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షి ంచారు పాఠశాల ఉపాధ్యాయ బృందం స్థానికులు టి సింధును పర్యవేక్షకురాలు రెడ్డి భాగ్యాంబను అభినందించారు.



## శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం సంరక్షణ

**మైదుకూరు, జూన్ 19, ప్రభాతవార్త:**

మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ వారి సహకారంతో పొలం సంరక్షణ ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం బాలకృష్ణ సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి కెవికె వారు అధిక ఎరువుల (రసాయనికంగా) వాడకం వలన కలిగే దుష్ప్రభావాలు, భూమి ఆరోగ్యాన్ని పెంపొందించడానికి పాటించవలసిన సుస్థిర వ్యవసాయ విధానులైటువంటి జీవ ఎరువుల వాడకం పచ్చి రొట్టె ఎరువుల సాగు, వ్యవసాయ పంటలలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, మట్టి పరీక్ష విధానం, ప్రాముఖ్యత గురించి క్లుప్తంగా వివరించారు. డాక్టర్ ఎన్ శ్రీ విద్యారాణి శాస్త్రవేత్త (విస్తరణ విభాగం), పకృతి వ్యవసాయ విధానాలను అలాగే పిఎండీఎస్(మాన్ సూన్ డ్రై సోయింగ్)గురించి తెలియజేశారు. డాక్టర్ టి విజయనిర్మల శాస్త్రవేత్త వర్షాకాలంలో పాడి పశువులలో వచ్చే గొంతువాపు మరియు జబ్బు వాపు గురించి, జీవాలల్లో వచ్చే చిటుక వ్యాధి గురించి తెలియజేసి టీకాలను వ్యాధి నివారణగా పాటించాలని, అదేవిధంగా అంతర పరాన జీవుల బెడద నుండి నెమ్ము కొరకు ఏలిక పాముల మందులను పశువులకు తాగించాలని తెలియజేశారు. తదుపరి శ్రీకాంత్ రెడ్డి మండల వ్యవసాయ శాఖ అధికారి వరి పొలాలలో పాటించవలసిన ఎరువుల యాజమాన్యం మరియు వ్యవసాయ శాఖ స్కీముల గురించి తెలియపరిచారు. శ్రీ విజయ విహారి, డిడిఎం నాబార్డు వారు గ్రామీణ బ్యాంకులలో అమలయ్యే రుణాలు అలాగే కిసాన్ క్రెడిట్ కార్డు, మరియు నాబార్డు ద్వారా వచ్చే స్కీముల, రకాల గురించి వివరించారు. పద్మజ అగ్రికల్చర్ ఆఫీసర్ జిల్లా వనరుల కేంద్రం వారు ఎరువుల కొరకు తమ పేరును యాప్ లో నమోదు చేసుకోవాలని అలాగే మట్టి పరీక్ష గురించి తెలియజేశారు. చెన్నకేశవులు బిటిఎం ఆత్మా వారు వరి మరియు శనగలు పాటించవలసిన పోషక యాజమాన్యం గురించి తెలిపారు. తదుపరి మట్టి పరీక్ష విధానం మరియు వ్యవసాయ పంటలపై ప్రచురణను మరియు నీమాస్త్రమును రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమం వి ఏ ఏ, వీహెచ్‌ఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.



## టీబీ అంతం అందరి పంతం

**పెండ్లిమర్రి, జూన్ 19, ప్రభాతవార్త:**

టీబీ ముక్త భారత్ అభియాన్ (క్షయ రహిత భారత్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెండ్లిమర్రి పీహెచ్‌సీ పరిధిలోని వెల్లటూరు విలేజ్ క్లినిక్‌లో డా. జేవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మరియు ఎక్స రే తీయడం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా.ప్రసాద్ మాట్లాడుతూ క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్కులిన్ అనే క్రిమి వలన గాలి ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాపిస్తుందన్నారు. 2 వారాలకు మించి దగ్గు, రాత్రులు జ్వరం రావడం, ఛాతిలో నొప్పి, దగ్గినప్పుడు గళ్లలో రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. శనివారం తిప్పిరెడ్డిపల్లిలో హై రిస్క్ గ్రామాలలోని ప్రజలకు ఎక్సరే తీసి నిర్ధారణ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే 6 నెలల పాటు ఉచితంగా మందులు, చికిత్స తీసుకున్న వారికి పోషకాహారం కోసం నెలకు రూ.వెయ్యి వారి బ్యాంకు ఖాతాలో నేరుగా ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్‌ఈవో శ్రీదేవవి, హెల్త్ సూపర్‌వైజర్ ఎల్లమ్మ, టీబీ సూపర్‌వైజర్ సుధా మాధురి, టెక్నిషియన్ ప్రసన్న కుమార్, సీహెచ్‌ఓ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## గుంతఎంబాడీ గ్రామంలో 104 వైద్య సేవలు

**రామసముద్రం జూన్ 19 ప్రభాతవార్త**

అంటురోగాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని రామసముద్రం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ప్రత్యూష తెలిపారు, మండలంలోని కేసీ పల్లె గ్రామ పంచాయతీ గుంతఎంబాడీలో శుక్రవారం 104 వైద్య సేవలు నిర్వహించి రోగులకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్‌లు పరీక్షలు చేసి పలు జాగ్రత్తలు సూచనలు చేశారు, ఆమె మాట్లాడుతూ ఈ 104 శిబిరంలో అన్ని జబ్బులకు పరీక్షలు చేసి వైద్యం చేసి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేస్తామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో మండల పిహెచ్‌సి సిబ్బంది ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



## ప్రపంచ సీకిల్ సెల్ దినోత్సవ ర్యాలీ

**పీలేరు జూన్ 19 ప్రభాతవార్త:**

సీకిల్ సెల్ వ్యాధి అనేది వారసత్వంగా వచ్చే ఎర్ర రక్త కణాల రుగ్మతల సమూహం అని,తీవ్రతను బట్టి వ్యాధిపై అవగాహన అందరికీ అవసరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కొండయ్య ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ప్రధానవైద్యాధికారుల అదేశాలమేరకు మర్రిమాకుల పల్లె తాండలో పురప్రజలకు అవగాహన కల్పించి మరియు వారిచే ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండయ్య మాట్లాడుతూ వ్యాధి లక్షణాల్లో బాగంగా రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపు రంగులో మారడం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా వచ్చే అంటువ్యాధులు వ్యాధి లక్షణాలని కేవలం రక్తపరీక్షల ద్వారానే తెలుసుకోవచ్చు నని, అందరిలో వచ్చే ఈ వ్యాధి గిరిజన జనాభాలో ఎక్కువ వచ్చే అవకాశం ఉందని, కొండయ్య తెలిపి, ఆరోగ్యమే మహా భాగ్యమని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణమ్మ సిహెచ్ లావణ్య ఆశా కార్యకర్తలు గ్రామీణ ప్రజలు పాల్గొన్నారు.





## ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

**వేంపల్లి: జూన్ 19 ప్రభాతవార్త**

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పక్కీరుపల్లిలోని బూత్ నెం. 248 వద్ద నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామముని రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) తమ పరిధిలోని ప్రతి ఓటరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అధికారులు, బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో మ్యాపింగ్ ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బూత్ ఇంచార్జ్ ఇస్మాయిల్, నాయకులు డక్కా రమేష్, జబీబుల్లా, లాడెన్, భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.